పరిష్కారం చూపండయ్యా..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 244 వినతుల అందజేత
- చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ ఆనంద్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు



హాజరైన వివిధ శాఖల అధికారులు

నెల్లూరు రూరల్: 'సార్.. మా సమస్యలపై వినతులు అందిస్తున్నాం. వీటికి తగిన పరిష్కారం చూపండి' అని ప్రజలు అధికారులను కోరారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి జనం వెల్లువలా విచ్చేసి వినతులు అందించారు. వివిధ శాఖలకు సంబంధించి 244 వినతిపత్రాలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ మండల కేంద్రాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అర్జీదారులు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి వినతులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ శాఖ 120, మున్సిపల్ శాఖ 16, సర్వే 16, పంచాయతీరాజ్ శాఖ 19, సివిల్ సప్లయీస్ 12, ఇతర శాఖలకు సంబంధించి వినతులు అందాయి.

గురుకుల పాఠశాల సమస్యలపై..

అల్లూరు మండలం నార్త్ ఆములూరు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. 5 నుంచి 10 వరకు తరగతుల్లో సుమారు 200 మంది విద్యార్థులున్నారని, అయితే ఐదు గదులు మాత్రమే ఉన్నాయన్నారు. విద్యార్థినులకు అవి సరిపోవడం లేదన్నారు. మరో ఐదు గదులు నిర్మిస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని లేదా తాత్కాలికంగా వేరే చోటుకి మార్చాలని కోరారు.

జలాశయాలపై..

సోమశిల, కండలేరు జలాశయాలు, సంగం, నెల్లూరు బ్యారేజీలకు సంబంధించిన పలు అంశాలపై బీజేపీ నాయకుడు మిడతల రమేష్ వినతిపత్రం అందించారు. వాటి వద్ద నీటి నిర్వహణ కోసం ఆపరేటర్లు లేరని, ఏఈ, డీఈలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాళ్లపాడు ప్రాజెక్ట్ కుడికాలువ గేటు మరమ్మతులకు గురైందన్నారు. సోమశిల, కండలేరుకు ఆకస్మిక వరద వస్తే అత్యవసర నిర్వహణ సాధ్యం కాదని, యుద్ధ ప్రాతిపదికన ఆపరేటర్ల నియామకం చేపట్టాలన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



మాట్లాడుతున్న రమేష్ తదితరులు

పునరావృతం కాకూడదు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): 'ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు పునరావృతం కాకూడదు. నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలి' అని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం వినతులను స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగం 19, హౌసింగ్ విభాగం 02, పబ్లిక్ హెల్త్ విభాగం 02, టౌన్ ప్లానింగ్ విభాగం 8, అకౌంట్ సెక్షన్‌కు సంబంధించి ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎన్‌ఎంసీ పరిధిలోని సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు తెలియజేస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఖాళీ స్థలాల్లో పార్కులను నిర్మించనున్నామని, వాటి నిర్వహణ బాధ్యతలను స్థానిక కమిటీలు లేదా వ్యాపార సంస్థలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ నందన్, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా, అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ నగరంలోని జీవీఆర్ కళాశాల పక్కనున్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టారని చర్యలు తీసుకోవాలని చేకూరి సురేష్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ బీవీనగర్‌లోని రాజు కాంప్లెక్ సమీపంలో సర్వే నంబర్ 90/2, 90/5లో ఓ వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. దీనికి అనుమతి లేదని, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. సదరు వ్యక్తి వేదాయపాళెంలోని సర్వే నంబర్ 78/2లో 42 అంకణాల స్థలాన్ని అధికారులను ప్రలోభపెట్టి అక్రమంగా పట్టా పొందారని ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు తాము పట్టాలు ఇవ్వలేదని ధ్రువీకరించారన్నారు. విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ శెట్టిగుంటరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో స్తంభాలు మారుస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఆ శాఖ నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతి నగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫిబ్రవరిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వచ్చే ఫిబ్రవరి ఒకటి నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం సాయంత్రం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూఅప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలను ప్రజలపై భారం మోపడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం లాంటి నిర్ణయాలు తీసుకుందన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ ఇంటింటి ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా పార్టీ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఇంకా మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



ర్యాలీలో పాల్గొన్న జడ్జి వాణి, వివిధ శాఖల అధికారులు

- సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(లీగల్): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బాలలను బడికి పంపడమే లక్ష్యంగా పనిచేద్దామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. బాల కార్మిక నియంత్రణ చట్టంపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ర్యాలీని జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సి.యామిని ఆధ్వర్యంలో ఆపరేషన్ స్వేచ్ఛ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు బి.సురేష్, గౌస్‌బాషా, సీహెచ్ రామారావు, రామకృష్ణారెడ్డి, ఏఎస్సై శ్రీహరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- నగరంలో హల్‌చల్
- రెండు చోట్ల చోరీలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



హరనాథపురంలోని అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన దొంగలు

నెల్లూరు సిటీ: నగరంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారు. ఇనుపరాడ్లతో ఓ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడం సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. జనం ఆందోళన చెందుతున్నారు.

➡ చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పార్లుకట్ట ప్రాంతంలో పి.దామోదర్, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. దామోదర్ రియల్ ఎస్టేట్, చిట్స్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 15వ తేదీన దంపతులు తమ ఇంటికి తాళం వేసి వేదాయపాళెంలో నివాసం ఉంటున్న కుమార్తె వద్దకెళ్లారు. అందరూ కలిసి అల్లీపురంలోని బంధువుల ఇళ్లకు వెళ్లారు. అర్ధరాత్రి దామోదర్ దంపతులు తమ ఇంటికి చేరారు. అప్పటికే తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. 32 సవర్ల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

➡ కృష్ణపట్నంలోని ఆయిల్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేసే పంకజ్‌కుమార్ హరనాథపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. గత నెల 28వ తేదీన ఆయన కుటుంబంతో కలిసి ఉత్తర భారతదేశ యాత్రకు వెళ్లారు. ఈనెల 13వ తేదీ రాత్రి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖాలకు ముసుగు ధరించి ఇనుపరాడ్లతో పంకజ్‌కుమార్ ఇంటి తలుపులు పగులగొట్టి బంగారం చోరీ చేశారు. 14వ తేదీన ఎదురింటి వారు గమనించి పంకజ్‌కుమార్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్లోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. సోమవారం నెల్లూరుకు చేరుకున్న పంకజ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 250 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగలు అపార్ట్‌మెంట్లోకి ప్రవేశించే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మరో రెండుచోట్ల కూడా..

నెల్లూరు నగరంలో మరో రెండుచోట్ల కూడా చోరీలకు యత్నించినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు రాలేదు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాతో నగరవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఉత్సాహంగా క్రిస్మస్ క్యారల్స్



దైవ సందేశమిస్తున్న బిషప్ ప్రకాశం, చిత్రంలో నిర్వాహకులు

- నగరంలో క్రిస్మస్ సందడి



చర్చి ఎదుట ప్రత్యేక వాహనం

నెల్లూరు(బృందావనం): సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో క్రిస్మస్ క్యారల్స్ ఉత్సాహంగా జరిగింది. అసోసియేట్స్ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏబీఎం కాంపౌండ్ వద్ద జరిగిన ప్రారంభోత్సవంలో బిషప్ మోస్ట్ రెవరెండ్ ఎండీ ప్రకాశం, బాప్టిస్ట్ చర్చి డానీ హాల్ పాస్టర్ రెవరెండ్ కె.శ్యాంసన్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ రాయ్, క్రైస్తవ నాయకులు ఉరందూరు సురేంద్రబాబు, బర్నబాస్ కొవ్వొత్తులు వెలిగించి, బెలూన్లు వదిలారు. గాయక బృందం క్రిస్మస్ గీతాలను ఆలపించింది. కనకమహల్ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్, వీఆర్సీ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్, కొండాయపాళెంగేట్ సెంటర్, వేదాయపాళెం సెంటర్ మీదుగా డైకస్‌రోడ్డు సెంటర్, పొదలకూరు రోడ్డు, బట్వాడిపాళెం సెంటర్ వరకు క్యారల్స్ ర్యాలీ జరిగింది. శాంతాక్లాజ్‌ల నృత్యాలు అలరించాయి. ఆయా సెంటర్లలో పాస్టర్లు, దైవజనులు క్రిస్మస్ శుభాకాంక్షలు అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానీజో, క్వైర్ డైరెక్టర్ బిల్లీ శ్యాంసన్, సభ్యులు విద్యాధర్, మహేష్, సంజయ్, సందీప్, సుహాసిని, సంధ్య, జెన్నీజోయల్, ఆరోన్, వికాస్, డైరెక్టర్ జీటీ మౌంట్ బాటన్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన

ఆస్పత్రుల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, మాస్ మీడియా అధికారి కనకరత్నంలు పలు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను సోమవారం తనిఖీ చేశారు. అపోలో, దుర్గా, నారాయణ, మెడికవర్ హాస్పిటళ్లలోని స్కానింగ్ కేంద్రాలను, శ్రీనివాస స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు, నివేదికలు, ఫారం-ఎఫ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ యాజమాన్యాలతో మాట్లాడుతూ స్కానింగ్ చేసిన ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు. అలా నమోదు చేయని వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్షయ నివారణ జిల్లా కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్



విజేతలతో ఎస్పీ, పోలీస్ అధికారులు

నెల్లూరు సిటీ: పోలీస్ కవాతు మైదానంలో ఆదివారం ప్రారంభమైన జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2024 సోమవారం రాత్రి ముగిసింది. వివిధ పోటీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను 126 పాయింట్లతో ఏఆర్ విభాగం కైవసం చేసుకుంది. పురుషుల చాంపియన్‌షిప్‌ను 23 పాయింట్లతో ఏఆర్ పీసీ ఎస్.అంకయ్య, మహిళల చాంపియన్‌షిప్‌ను 26 పాయింట్లతో ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ ఎ.చందన అందుకున్నారు. విజేతలకు ఎస్పీ కృష్ణకాంత్ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం క్యాంప్ ఫైర్‌లో అధికారులు, సిబ్బంది పాల్గొని నృత్యాలు చేశారు.

అర్హులకు వేగంగా రుణాల మంజూరు

- మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్



మాట్లాడుతున్న తేజ్ భరత్

నెల్లూరు(బారకాసు): 'నగరంలో ప్రయోగాత్మకంగా 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో అర్హులకు రుణాలను మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి' అని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ తెలియజేశారు. కమిషనర్ సూర్యతేజ ఆధ్వర్యంలో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఎన్‌ఎంసీ పరిధిలోని వీధి వ్యాపారులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆలోచనల మేరకు సత్యనారాయణపురం, మైపాడు గేట్ జాఫర్‌సాహెబ్ కాలువ ప్రాంతంలో 200 దుకాణాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధి, భద్రత కోసం రూపొందించిన టౌన్ వెండింగ్ కమిటీ ద్వారా అవసరమైన అన్ని చర్యలు వేగవంతంగా పూర్తి చేసి ప్రాజెక్టును త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, టీపీఆర్‌ఓ బాలకృష్ణ, మెప్మా రాష్ట్ర మిషన్ మేనేజర్స్ ఆదినారాయణ, శ్రీనివాసులు, ప్రభావతి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కాగా చెత్త సేకరణ

'నగరపాలక సంస్థ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో గార్బేజ్ పాయింట్లు ఏర్పడకుండా పర్యవేక్షించాలి. ఇంటింటి నుంచి చెత్త సేకరణను పక్కాగా నిర్వహించాలి' అని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. రెండో డివిజన్‌లో సోమవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన స్థలాల్లో పార్కుల నిర్మాణం కోసం జంగిల్ క్లియరెన్స్ చేయించాలని ఆదేశించారు. గుడపల్లిపాడు ప్రాంతంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి స్థానికులకు తాగునీటి కుళాయి కనెక్షన్లను వేగవంతం చేయాలని సూచించారు. నరుకూరు సమీపంలో అనధికార భవనం నిర్మాణం చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. గుడపల్లిపాడు డ్రెయిన్ నిర్మాణాలకు వర్క్ ఆర్డర్ ఇచ్చినా ప్రారంభించని కారణంగా ఇన్‌చార్జి ఏఈకి, స్థానిక వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. స్థానికంగా ఉన్న ప్రధాన పంట కాలువకు సంబంధించిన సమస్యలను పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెండో డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డీఈలు, ఏఈలకు శిక్షణ నేడు

నెల్లూరు(పొగతోట): సీసీ రోడ్ల నిర్మాణం, నాణ్యత తదితర అంశాలపై డీఈలు, ఏఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పీఆర్ ఎస్‌ఈ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ ఇస్తామని తెలియజేశారు.

క్లుప్తంగా

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు రూరల్: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన ప్రచార వాల్ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్, అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవానీ పాల్గొన్నారు.

నరసింహకొండపై ధనుర్మాస పూజలు



నెల్లూరు సిటీ: ధనుర్మాసం సందర్భంగా రూరల్ మండలం నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం నుంచి రోజూ ఉదయం 6 గంటలకు తిరుప్పావై పారాయణం, 6.30 నిమిషాలకు ధనుర్మాస నివేదన, 7 గంటలకు తిరుప్పావై ప్రవచనం, ప్రాతఃకాల దీపారాధన నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

ఖోఖో పోటీలకు కేఎన్నార్ విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం

నెల్లూరు(టౌన్): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ తెలిపారు. ఈనెల 21వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీలకు ఎంపికైన చిరంజీవి, పవిత్ర, భార్గవి, నవీన్‌లను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అలాగే స్కూల్లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి నరేంద్రబాబు, టీచర్లు పాల్గొన్నారు.

వివిధ పోటీలకు ప్రభుత్వ బీఈడీ విద్యార్థుల ఎంపిక



చినబాబు



ప్రదీప్

నెల్లూరు(టౌన్): అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు పి.చినబాబు (వాలీబాల్), ప్రదీప్ (ఫుట్‌బాల్) ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల్, పీడీ ఎం.రవీంద్రబాబు తెలిపారు. సోమవారం సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి తిరువనంతపురంలోని కేరళ యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో విక్రమ సింహపురి యూనివర్సిటీ తరఫున చినబాబు పాల్గొంటారన్నారు. 21 నుంచి కేరళలోని కాలికట్‌లో జరిగే ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీల్లో వీఎస్‌యూ తరఫున ప్రదీప్ పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

నెల్లూరు(సెంట్రల్): వీపీఆర్ స్కూల్లో చదువుతున్న శివగాయత్రి అనే విద్యార్థిని నంద్యాలలో ఇటీవల జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ చూపింది. దీంతో సోమవారం ఆమెను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు అభినందించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వీపీఆర్ స్కూల్‌కు ద్వితీయ స్థానం దక్కడం సంతోషకరమన్నారు. త్వరలో జార్ఖండ్‌లో జరిగే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

'భరణం ఇవ్వకుండా వేధిస్తున్నాడు'

నెల్లూరు రూరల్: కోర్టు ఉత్తర్వులున్నా మాజీ భర్త అజహర్‌బాషా భరణం ఇవ్వకుండా వేధిస్తున్నాడని భగత్‌సింగ్ కాలనీకి చెందిన రుబీనా అనే మహిళ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ అజహర్‌బాషా సంగంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారని, తనను మోసగించి విడాకులు ఇచ్చారన్నారు. కోర్టు నెలకు రూ.20 వేలు భరణం ఇవ్వాలని ఆదేశించిందన్నారు. అతను స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ర్యాలీ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.